# పోలవరం విద్యార్థికి ఒంగోలు ట్రిబుల్ ఐటీలో సీటు



**చాట్రాయి, జూన్ 29 ప్రభాతవార్త** మండల పరిధిలోని పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఉండి నాగ మౌనేష్ ప్రతిష్ఠాత్మకమైన ట్రిబుల్ ఐటీ ఒంగోలు క్యాంపస్‌లో సీటు సాధించాడు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో నాగ మౌనేష్ 571 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ ఘనత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి 1 మాసగిరి శ్రీనివాస్ చెప్పారు. విద్యార్థి తండ్రి ఉండి వీర వెంకట నాగ మారీశ్వర రాజు వ్యవసాయం మరియు ఇతర వృత్తి చేస్తూ కుమారుడిని ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చాట్రాయి మండల విద్యాశాఖాధికారి-1 మాసగిరి శ్రీనివాస్ మరియు పోలవరం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాణి మేకల శ్రీనివాసరావు విద్యార్థి నాగ మౌనేష్‌ను, వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సరైన లక్ష్యంతో శ్రమిస్తే కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా అద్భుత ఫలితాలు సాధించవచ్చని మౌనేష్ నిరూపించాడని కొనియాడారు. ట్రిబుల్ ఐటీలో సీటు సాధించడం ద్వారా గ్రామానికి, మండలానికి మంచి పేరు తెచ్చాడని హర్షం వ్యక్తం చేశారు.?పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ నాగ మౌనేష్ మొదటి నుండి చదువులో ఎంతో ప్రతిభావంతుడని, క్రమశిక్షణతో చదివి ఈ రోజు సీటు సాధించడం పాఠశాల సిబ్బంది అందరికీ ఎంతో గర్వకారణంగా ఉందని తెలిపారు. విద్యార్థికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయ బృందాన్ని కూడా ఆయన అభినందించారు. మౌనేష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# తన సొంత నిధులతో డ్రైనేజ్ సమస్య తీర్చిన ఎంపిటిసి



**చాట్రాయి, జూట్ 29, ప్రభాతవార్త** చాట్రాయి మండలంలోని కృష్ణారావు పాలెం గ్రామంలో విజయవాడ సత్తుపల్లి పోవు తారు రోడ్డు (రమణ శ్రీకాంత్ ఇంటి ఎదురు) నందు వర్షపు నీరు నిలిచి తారు రోడ్డు పై పెద్ద గొయ్యి ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్న సంగతి తెలుసుకున్న కృష్ణారావుపాలెం ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరరావు సొంత నిధులతో ఫోక్లీనర్ సహాయంతో డ్రైనేజీ తీయించి సమస్యని పరిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు కృష్ణారావు పాలెం ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరరావు ని పలువురు గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రమణ శ్రీకాంత్, మరియు గ్రామస్తులు గుంజి కోటేశ్వరరావు పందు జిన్నా పుచ్చకాయల మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా ఉత్పత్తులకు
# మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి
## బిజెపి జనతా వారధి



**భీమవరం టౌన్, జూన్ 29 : ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్‌లో స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) పనితీరు, మహిళా సాధికారత, డ్వాక్రా సంఘాల నిధులు, విధులు, సమావేశాలు, ఆడిట్ పై సమగ్ర సమీక్ష నిర్వహించి, డ్వాక్రా రుణాలు బ్యాంకుల ద్వారా కాకుండా నేరుగా తక్కువ వడ్డీలకు ఆప్కాబ్ ద్వారా ఇచ్చి, డ్వాక్రా ఉత్పత్తులకు డీసీఎంఎస్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, అవసరమైన సంస్కరణలు చేపట్ట వలెనని కోరుతూ జెసి టి రాహుల్ కుమార్ రెడ్డికి జనతా వారధి సోమవారం వినతిప త్రం సమర్పించింది. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా కన్వీనర్ తోట గంగ రాజు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు కేవలం రుణాల పంపిణీ వ్యవస్థగా కాకుండా మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి, సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధికి కేంద్రాలుగా మారాలని అన్నారు. ప్రస్తుతం బ్యాంకులు, మైక్రో ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్ అప్పుల కారణంగా మహిళలు అధిక రుణ భారంలో చిక్కుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్వాక్రా రుణాలను బ్యాంకుల ద్వారా కాకుండా ఆప్కాబ్ ద్వారా నేరుగా తక్కువ వడ్డీకి అందించడంతో పాటు, డ్వాక్రా ఉత్పత్తులకు డీసీఎంఎస్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే గ్రామ సంఘాలు, మండల సమా ఖ్యలు, జిల్లా సమాఖ్యల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించి, స్వతంత్ర సామాజిక ఆడిట్లు నిర్వహించాలని, రుణాల మంజూరులో బలవంతపు భీమాలు, అక్రమ వసూళ్లను అరికట్టి పారదర్శకతను పెంపొం దించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు డిజిటల్ లిటరసీ, ఆర్థిక నిర్వహణ, పారిశ్రా మిక నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణలు అందిం చి, డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెట్ లింకేజ్, ఈ-కామర్స్ మరియు డీసీఎంఎస్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాల ని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనతా వారధి కో-కన్వీ నర్ గాదిరాజు వెంకటేశ్వరరాజు, ఏ.శివ, బీహెచ్ సుబ్బరాజు, సిహెచ్ నాగరాజు, అడవి శేఖర్, వి.వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా కాల భైరవ నవగ్రహ మృత్యుంజయ ప్రతిష్ట



**కాళ్ళ జూన్ 29 (ప్రభాతవార్త)** మండల కేంద్రమైన కాళ్ల శివాత్మానంద ఆశ్రమంలో కాలభైరవ నవగ్రహ పూర్వక మృత్యుంజయ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. త్రయాహ్నిక దీక్షతో ఈ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వహకులు కటికి రెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే పూజలు హోమాలు ప్రతిష్ట మహోత్సవాలు పుల్లేటికుర్తి శేష మణిదీప్ శర్మచే నిర్వహించినట్లు తెలిపారు. త్రయాహ్నిక ప్రతిష్టా మహోత్సవ మొదటి రోజు గో పూజ,వేద స్వస్తి,మూర్తులకు తూష్ణీం స్నపనమ్, ఆలయ శాలా ప్రదక్షిణమ్, ప్రవేశ బలి, గురు అనుజ్ఞ, దీప ప్రజ్వలన,గణపతిపూజ, పుణ్యాహవాచనమ్, మార్జనలు, పంచగవ్యస్థాపన, మార్జన, ప్రాశన, ఋత్విక్ వరుణ, నవగ్రహ దీక్షాధారణ,కంకణ ధారణ, అఖండస్థాపన, అస్త్రరాజార్చన, మృత్సంగ్రహణ, ఆలయశాలా ప్రదక్షిణ, శాలా ప్రవేశం, అంకురారోపణ, అగ్ని మధనం, అగ్ని ప్రతిష్టాపన,ద్వాదశ పాత్ర ప్రయోగం, ఆవరణ హోమం, మూర్తి హోమం, బ్రహ్మ, విష్ణు, రుద్ర హోమాలు, మూల మంత్ర హవనములు,లఘు పూర్ణాహుతి, అగ్ని సంరక్షణ, నవ కలశ స్థాపన, ధ్వజారోహణం, భేరీ పూజ, ద్వాదశ రాగాలాపన, బలిహరణ,రెండవ రోజు, వాస్తు పూజ, వాస్తు హోమమ్, వాస్తు బలి, వాస్తు పర్యగ్ని కరణ,గ్రామప్రదక్షిణమ్, గ్రామ బలిహరణ, లక్షణోద్ధారణ, జలాధివాస సహిత శ్రీరాధి వాసం, సముద్ర, నదీ జల,సుగంధ ద్రవ్యాలతో అధి వాసకాలభైరవ నవగ్రహ పూర్వక మృత్యుంజయములు, అధివాసాంగ హోమాలు, ధాన్యాదివాసం, అధివాసాంగ హోమాలు, శాంతి కుంభ స్థాపన, మండపార్చన, శాలాంగ దేవతా హోమాలు, అంగ, ప్రత్యంగ హోమాలు, రుద్ర శ్రీ సూక్త, దుర్గా సూక్త హోమములు, శాంతి హోమ,దిశా హోమ, తత్వానుసంధాన హోమాలు, త్రిస: హోమాలు, అష్టాత్రింశత్కళా హోమం,చతుర్నవతి కళాహోమమ్, చతుష్షష్టి కళా హోమాలు, మూలమంత్ర హోమాలు, బలిహరణ, ప్రధాన కుంభావాహన, మూర్తి, తత్వ న్యాసాలు, పంచ శయ్యాధి వాసం, మూడవ రోజు ధాతుస్థాపన, యంత్ర స్థాపన, బింబస్థాపన, అష్ట బంధనం, జీవన్యాసం, కుంభాభిషేకం,గో పృష్ట దర్శనమ్, శాంతి కళ్యాణం, కాళ్ళకూరు పుల్లేటికుర్తి భోగేశ్వర శర్మ ఆశీస్సులతో పుల్లేటికుర్తి గణపతి శర్మ బ్రహ్మత్వమ్ లో పుల్లేటికుర్తి మణిదీప శర్మ మరికొంత మంది రుత్వికులచే ఈ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

## అమరావతి రైతులపై టీడీపీ గూండాల
# దాడిని ఖండించాలి,చింతపల్లి గురు ప్రసాద్



**పెనుమంట్ర, జూన్-29, (ప్రభాతవార్త)** అమరావతి రైతులపై టీడీపీ గూండాల దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని వైకాపా బీసీ కులాల రాష్ట్ర కన్వీనర్ చింతపల్లి గురుప్రసాద్ అన్నారు. సోమవారం పెనుమంట్రలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాజధాని రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని చూపించాలని తాము పిలిచామని, అమరావతిలో అక్రమాలు, దోపిడీ బయటపడతాయనే వారిని అడ్డుకున్నారని విమర్శించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అక్కడకు వెళ్తే కూటమి ప్రభుత్వం చేసే అన్యాయాలు బహిర్గతం అవుతాయనే భయంతోనే అక్కడకు వెళ్లకుండా పోలీసుల సాయంతో అడ్డుకుంటున్నారని ఆయన అన్నారు. ఇది ప్రజాస్వామిక హక్కులపై దాడేనని చింతపల్లి గురుప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కూడా రమ్మని కోరామని, మా పొలాలను అన్యాయంగా లాక్కోవాలని ప్రభుత్వం చూస్తోందని అన్నారు. అందుకోసం చట్టాలు, న్యాయస్థానాల ఆదేశాలను ఉల్లంఘిస్తోందని, పొలాలు ఇవ్వకపోతే గోతులు తీస్తున్నారని, దారులు మూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అరాచకాలపై వెనక్కి తగ్గే ప్రశ్నే లేదని, న్యాయస్థానాల్లో పోరాడుతామని స్పష్టం చేశారు. భూములు ఇచ్చిన రైతులకు మేలు కన్నా కీడే ఎక్కువగా జరుగుతోందని, అందుకే అమరావతి రైతులు ప్రశ్నిస్తున్నారని, వారి మాటలు ప్రభుత్వానికి అరణ్య ఘోషగా మిగిలిపోతున్నాయని ఆయన అన్నారు.

# మానవత కార్యాలయం ప్రారంభం



**పెనుమంట్ర, జూన్-29, (ప్రభాతవార్త)** మానవతా పెనుమంట్ర శాఖ రీ కన్స్ట్రక్షన్ కార్యాలయమును ప్రముఖ దాత గోకవరపు కాశి విశ్వేశ్వర రావు, రాష్ట్ర కెరీర్ గైడెన్స్ చైర్ పర్సన్ కోడూరి రాధా పుష్పవతి చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ పడాల రామచంద్రారెడ్డి సెక్రెటరీ చదువుల నరేంద్ర ట్రెజరర్ అమృతవాకుల సత్యనారాయణ జిల్లా కమిటీ కొత్త సత్యనారాయణ మూర్తి ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ చిర్ల శ్రీనివాస్ రెడ్డి(సి ఎస్ ఆర్) అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి కృష్ణారెడ్డి రీజనల్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు కో చైర్మన్ పడాల జగన్నాథరెడ్డి కోణాల నర్సిరెడ్డిచిర్ల వంశీ కర్రి బుల్ రెడ్డి అశోక్ రెడ్డి మొదలైన వారు పాల్గొన్నారు

## లింగపాలెం మండల బిజెపి పార్టీ అధ్యక్షులుగా బండారు సత్యనారాయణ.



**లింగపాలెం జూన్ 29 (ప్రభాతవార్త)** లింగపాలెం మండల భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం మఠం గూడెం లోని ఆర్ఎస్ఎస్ చక్రధరావు ఇంటి దగ్గర సమావేశం జరిగింది ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులుగా బండారు సత్యనారాయణ గారిని మండల పార్టీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుర్ర వెంకట సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్అసెంబ్లీ కన్వీనర్ ఏసు వరప్రసాద్ సాయి కృష్ణ ఎస్ వి నాగేశ్వరరావు కే ఎన్ వి రామకృష్ణ సత్యనారాయణ పొదిలి ప్రవీణ్ కుమార్ తాళ్లూరు కుమార్ పరస సాగర్ పొదిలి జాన్ రాజ్ వీరు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అయినది మండల.బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలోని ప్రతి రైతు ఏపీఏఐఎంఎస్ 2.0లో పంట నమోదు చేసుకోవాలి
### --జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం జూన్ 29 ప్రభాతవార్త** జిల్లాలోని రైతులు ఖరీఫ్--2025 సీజన్ నుంచి వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న ఏపీఏఐఎంఎస్ 2.0 (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ దిశగా తీసుకెళ్తూ రైతులకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు ఏపీఏఐఎంఎస్ 2.0ను అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఏపీఏఐఎంఎస్ 2.0లో నమోదు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాల అమలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, పంటల వివరాల ధృవీకరణ, పంటల కొనుగోలు, అలాగే పంటలకు సంబంధించిన ఇతర సేవలను సులభంగా పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఏపీఏఐఎంఎస్ 2.0 ద్వారా రైతులకు పలు ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. రైతులు నమోదు చేసిన పంట వివరాల ఆధారంగా పంటలకు సంబంధించిన వ్యక్తిగత సూచనలు, చీడపీడలు, వ్యాధులపై ముందస్తు హెచ్చరికలు, తక్షణ నివారణ చర్యలకు సంబంధించిన సమాచారం మొబైల్ సందేశాల రూపంలో అందుతుందని వివరించారు. అలాగే పంట నమోదు ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా జరుగుతుందని, ఇన్‌పుట్ సబ్సిడీలు మరియు ఇతర ప్రభుత్వ పథకాల అమలులో ఖచ్చితత్వం పెరుగుతుందని తెలిపారు. రైతులు పలుమార్లు పత్రాలు సమర్పించాల్సిన అవసరం తగ్గి, ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. భూ యజమానులతో పాటు అర్హత కలిగిన కౌలు రైతులు కూడా నిర్దేశిత విధానంలో ఏపీఏఐఎంఎస్ 2.0లో నమోదు చేసుకుని ప్రభుత్వ ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రతి రైతు తప్పనిసరిగా సమీప రైతు సేవా కేంద్రం లేదా వ్యవసాయ అధికారులను సంప్రదించి తమ పంట వివరాలను ఏపీఏఐఎంఎస్ 2.0లో నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. రైతులు నమోదు చేసిన వివరాలు ప్రభుత్వ సేవలను వేగంగా, పారదర్శకంగా అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. జిల్లాలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధునిక డిజిటల్ వ్యవసాయ సేవల ద్వారా ప్రభుత్వ ప్రయోజనాలను పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విజ్ఞప్తి చేశారు.

# కొండల రాయుడు ఆలయంలో అన్న సమారాధన

**అత్తిలి,,జూన్ 29 (ప్రభాత వార్త )** అత్తిలి గంటావారి పుంతలో గల కొండల రాయుడు స్వామివారి వార్షికోత్సవాలు సందర్భంగా భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్తిలి పరిసర గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు ఈ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలాట భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

# 1008 కొబ్బరి కాయలతో బాలత్రిపుర సుందరి అలంకరణ



**భీమవరం జూన్ 29 ప్రభాతవార్త** పౌర్ణమి సందర్భంగా భీమవరం మెంటే వారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి ఆదివారం 1008 కొబ్బరి కాయలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో లీలా ధనరాజ్ చే అమ్మవారికి అభిషేకాలు, బోలిశెట్టి వెంకట నాగేశ్వరరావు, రంగమాంబ దంపతులచే శ్రీచక్రార్చన, నవర్ణార్చన, కుంకుమార్చన, చండీ హోమాన్ని ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ నిర్వహించారు. అనంతరం 1008 కొబ్బరికాయలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## ప్రకాశం పంతులు విగ్రహం ఏర్పాటు అభినందనీయం



**భీమవరం జూన్ 29 ప్రభాతవార్త** భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్ లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని నెలకొల్పడం అభినందనీయమని, మా వంతు పూర్తి సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ప్రకాశం పంతులు విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు సోమవారం వారిని కలిసి విగ్రహ ఏర్పాటుపై మాట్లాడారు. ప్రజల కోసమే జీవించిన మహనీయుడు టంగుటూరి అని, ఆయన ధైర్య సాహసాలకు, ప్రజాసేవకు, దేశభక్తికి ప్రతీకగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గన్నాబత్తుల శ్రీనివాస్, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

## దేశం కోసం అల్లూరి త్యాగనిరతి చిరస్మరణీయం
### -అల్లూరి ధైర్యం, తెగువ ఎనలేనిది-భీమవరంలో అల్లూరి 129వ జయంతి వారోత్సవాలు ప్రారంభం



**భీమవరం జూన్ 29 ప్రభాతవార్త** దేశం కోసం పోరాడి బ్రిటీష వారిని ఎదురించి ప్రాణాలర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగనిరతి చిరస్మరణీయమని అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షులు కంతేటి వెంకటరాజు అన్నారు. భీమవరం అల్లూరి సీతారామరాజు 125 అడుగుల విగ్రహం వద్ద సోమవారం శ్రీవిజ్ఞానవేదిక, వారోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వారోత్సవాలను ప్రారంభించారు. వెంకటరాజు మాట్లాడుతూ అల్లూరి ధైర్యం, తెగువ ఎనలేనిదని, ఆయన తిరుగుబాటుదారుడు కాదని, యువతకు ఆదర్శప్రాయుడని అన్నారు. అల్లూరి స్మృతి వనం సభ్యులు అల్లూరి సాయిదుర్గరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తెల్లవారి గుండెల్లో నిదురించిన పౌరుషాగ్ని రగిలించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని నివాళులర్పించారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోరాటానికి మారుపేరుగా విప్లవానికి చిరునామా నిలిచిన అల్లూరి స్ఫూర్తి దశాబ్దాలు గడిచినా భారతీయుల గుండెల్లో నిలిచిపోతుందన్నారు. జూలై 4వ తేదీ వరకు 9 పాఠశాలలు, 4 కళాశాలలో దేశభక్తి ర్యాలీలు, అవగాహన సదస్సులు, పోటీలను నిర్వహిస్తామని, విజేతలకు ముగింపు రోజున బహుమతులను అందజేస్తామన్నారు.

# వ్యవసాయాన్ని లాభసాటిగా చేసాం,ఎమ్మెల్యే చిర్రి,



**జీలుగుమిల్లి, జూన్-29, (ప్రభాతవార్త)**గత వైకాపా ప్రభుత్వంలో వ్యవసాయం నష్టాలను చవి చూస్తే, అదే వ్యవసాయాన్ని కూటమి ప్రభుత్వంలో లాభసాటిగా మార్చమని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బర్రింకలపాడు వద్ద ఏరువాక పౌర్ణమిలో పాల్గొని స్వయంగా దుక్కి దున్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత వైకాపా ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన రూ.6,500 కోట్ల బకాయిలను చెల్లించి రైతులకు అండగా నిలిచామన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, రాయితీపై విత్తనాలు, ఎరువులు సకాలంలో అందిస్తున్నామన్నారు. గత వైకాపా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దుచేసి కూటమి ప్రభుత్వం రైతు నేస్తం ప్రభుత్వంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పొట్టా రామారావు, కూటమి నాయకులు ఉండవల్లి సోమ సుందరం, సుంకవల్లి సాయి, చాట్రాతి ప్రసాద్, గుడ్ల రాంబాబు, ఎంపిటిసి నాలి శ్రీను, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈడూరులో శ్రీవారి చక్రస్నానం



**అత్తిలి, జూన్29 ( ప్రభాతవార్త )** అత్తిలి మండలం ఈడూరు వరాల వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాల సందర్భంగా శ్రీవారి చక్రస్నానం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం తోమాల సేవ అనంతరం మూల హోమం, మహా పూర్ణాహుతి, ధ్వజ అవరోహణ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని 108 మూరల మల్లెపూలతో విశేషంగా అలంకరించారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు 12 రకాల ప్రసాద నివేదనలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

# మంచిలి పిహెచ్సిని సందర్శించిన జిల్లా అధికారి



**అత్తిలి, జూన్ 29( ప్రభాత వార్త )** జిల్లా ఉప మలేరియా అధికారి యాతం నాగబాబు మంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను సందర్శించారు. వైద్యఅధికారి డాక్టరు పి. కిరణ్, డాక్టరు యోగేష్ కుమార్ సమక్షంలో మంచిలి సచివాలయం 1 ప్రాంతంలో ఏ ఎన్ ఎం లు, ఆశా ల తో క్షేత్ర స్థాయిలో సందర్శన చేసి ఎన్ వి బీడీసీపీ యాక్టివిటీస్ పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శాంత కుమార్, హెల్త్ అసిస్టెంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు సంస్కరణలు చేపట్టాలి!
### -బిజెపి జనతా వారధి ప్రభుత్వానికి విజ్ఞప్తి



**భీమవరం జూన్ 29 ప్రభాతవార్త** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనతా వారధి కార్యక్రమంలో భాగంగా జిల్లా కన్వీనర్ తోట గంగరాజు, కో కన్వీనర్ గాదిరాజు వెంకటేశ్వర రాజు నేతృత్వంలోని ప్రతినిధి బృందం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్‌లో స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) పనితీరు, మహిళా సాధికారత, డ్వాక్రా సంఘాల నిధులు, విధులు, సమావేశాలు, ఆడిట్ పై సమగ్ర సమీక్ష నిర్వహించి, డ్వాక్రా రుణాలు బ్యాంకులు ద్వారా కాకుండా నేరుగా తక్కువ వడ్డీలకు ఆప్కాబ్ ద్వారా ఇచ్చి, డ్వాక్రా ఉత్పత్తులకు డీసీఎంఎస్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, అవసరమైన సంస్కరణలు చేపట్ట వలెనని కోరుతూ వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా కన్వీనర్ తోట గంగ రాజు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు కేవలం రుణాల పంపిణీ వ్యవస్థగా కాకుండా మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి, సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధికి కేంద్రాలుగా మారాలని అన్నారు. ప్రస్తుతం బ్యాంకులు, మైక్రో ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్ అప్పుల కారణంగా మహిళలు అధిక రుణభారంలో చిక్కుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్వాక్రా రుణాలను బ్యాంకుల ద్వారా కాకుండా ఆప్కాబ్ ద్వారా నేరుగా తక్కువ వడ్డీకి అందించడంతో పాటు, డ్వాక్రా ఉత్పత్తులకు డీసీఎంఎస్ (DCMS) ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలు, జిల్లా సమాఖ్యల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించి, స్వతంత్ర సామాజిక ఆడిట్లు నిర్వహించాలని, రుణాల మంజూరులో బలవంతపు భీమాలు, అక్రమ వసూళ్లను అరికట్టి పారదర్శకతను పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు డిజిటల్ లిటరసీ, ఆర్థిక నిర్వహణ, పారిశ్రామిక నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణలు అందించి, డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెట్ లింకేజ్, ఈ-కామర్స్ మరియు డీసీఎంఎస్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనతా వారధి కో-కన్వీనర్ గాదిరాజు వెంకటేశ్వర రాజు, ఏ.శివ, బీహెచ్ సుబ్బరాజు, సిహెచ్ నాగరాజు, అడవి శేఖర్, వి.వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## జనసేన నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి : ఎమ్మెల్యే చిర్రి



**జీలుగుమిల్లి జూన్-29, (ప్రభాతవార్త)** జనసేన పార్టీ గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం కావాలంటే జనసేన నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. సోమవారం జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జనసేన నాయకులు--అధికారుల సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కీలకమని, గ్రామస్థాయిలో ప్రతి జనసైనికుడికి తగిన గుర్తింపు, గౌరవం లభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యకర్తల్లో ఎలాంటి అసంతృప్తి చోటుచేసుకోకుండా నాయకులందరూ పరస్పర అవగాహనతో ముందుకు సాగాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను సమర్థవంతంగా అమలు చేయాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజా సమస్యలను వెంటనే గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతి నాయకుడు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. జనసేన సిద్ధాంతాలు, ప్రజాసేవ పట్ల ఆకర్షితులై జీలుగుమిల్లి మండలంలోని 12 పంచాయతీల నుంచి సుమారు 100 కుటుంబాలు జనసేన పార్టీలో చేరడం ఆనందదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కుంజా రమేష్, బండారు అనిల్, కొప్పుల శ్రీకాంత్, రూపా సత్యనారాయణ, సూరిశెట్టి మహేష్, శేఖముడి సాయి, కర్రి మహేష్, వీరంకి వెంకటేశ్వరరావు, రాయి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ జగదాంబ అమ్మవారికి జలాభిషేకం



**జీలుగుమిల్లి, జూన్-29, (ప్రభాతవార్త)**మండల కేంద్రం జీలుగుమిల్లిలో వేంచేసి ఉన్న శ్రీ జగదాంబ అమ్మవారికి భక్తులు సోమవారం జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ శ్రీ జగదాంబ అమ్మవారి ఆలయాన్ని జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మరోచోటకి తరలిస్తున్న క్రమంలో అమ్మవారి శాంతి కోసం వెయ్యి బిందెలతో జలాభిషేకం చేసినట్లు తెలిపారు. గ్రామం అంత సుభిక్షంగా ఉండాలని ఈ అభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముత్తలపెద్ది హరికృష్ణ, గరిమెళ్ళ ప్రసాద్, గరిమెళ్ళ రామకృష్ణ శాస్త్రి, తంగిరాల సూర్యనారాయణమూర్తి, గరిమెళ్ళ గంగాధర శాస్త్రి, ఆలయ కమిటీ చైర్మన్ చిర్రి వెంకటేశ్వరరావు, కక్కిరాల చక్రి తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మ ఆలయానికి భూమి పూజ పాల్గొన్న సుబ్బారాయుడు రామరాజు



**నరసాపురం రూరల్ జూన్ 29 ప్రభాత వార్త** మల్లవరం పెద్దలంకలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి నూతన ఆలయ శంకుస్థాపన ఘనంగా జరిగింది. నరసాపురం మండలం మల్లవరం పెద్దలంక గ్రామంలో సోమవారం శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొత్తూరి రామరాజు మాట్లాడుతూ, గ్రామ దేవత అయిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా సమాజంలో ఐక్యత, సాంస్కృతిక విలువలను పెంపొందించే పవిత్ర స్థలాలని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తై భక్తులకు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామానికి ఎంతో శుభం జరుగుతుంది అని ప్రగతి పదం వైపు వెళుతుందని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలోనేతల ప్రసాదు మల్లవరం లంక తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తంగేళ్ల నాగేశ్వరరావు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు , సంధి నరసింహారావు సొసైటీ బ్యాంకు చైర్మం నాగిడి రాంబాబు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గూడూరి నాని, సత్యనారాయణ, కాళిదాసు, తంగేళ్ల శ్రీను గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

### -అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే కామినేని



కైకలూరు,జూన్ 29 (ప్రభాతవార్త)ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించి, కైకలూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆకాంక్షించారు. సోమవారం కైకలూరు ప్రభుత్వాసుపత్రి నందు సూపర్డెంట్ అల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆస్పత్రి అభివృద్ధిపై సమీక్షించారు. ఈసీజీ పేపర్ రోల్స్ కొనుగోలు, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ రిపేర్లు, ఎంసిబిల కొనుగోలు, పోస్టుమార్టం గది అభివృద్ధి పనులు, సిపియుల మరమ్మత్తులు, బ్లడ్ స్టోరేజ్ సెంటర్, మరుగుదొడ్డుల నిర్మాణం, కాళీ వైద్య పోస్టుల భర్తీ, ఎయిర్ కండిషనర్ ల మరమ్మత్తులు, డెంటల్ చైర్ కొనుగోలు మరియు పలు అంశాలపై ఎమ్మెల్యే చర్చించారు. ఆస్పత్రి అభివృద్ధి గురించి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తో ఫోన్లో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు సకాలంలో, నాణ్యమైన వైద్యం అందించి, వారి పట్ల వైద్యులు సిబ్బంది సానుభూతితో వ్యవహరించడం వల్ల ఆసుపత్రికి మంచి పేరు వస్తుందన్నారు.డిశ్చార్జ్ అయిన రోగులకు ఫోన్ ద్వారా వారి ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకోవడం మరియు అవసరమైన సలహాలు ఇవ్వడం వల్ల ఆసుపత్రిపై నమ్మకం పెరుగుతుందని వివరించారు. ముందుగా వార్డులో ఉన్న రోగులను పమర్శించి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొట్లూరు జగన్మోహన్రావు జ్ఞాపకాలతో వారి కుమారులు పొట్టోడు శ్రీనివాస్, విజయ్ లు ఆర్థిక సహకారంతో హాస్పటల్ డయాలసిస్ సెంటర్ కి అందించిన నూతన మిషనరీని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విటల్ రావు,కూటమి నాయకులు పూల రాజి,కొల్లి వరప్రసాద్ (బాబి),నల్లగోపుల చలపతి,జానీ, మంగినేని రామకృష్ణ,పడమట వాసు, అభివృద్ధి కమిటీ సభ్యులు,వైద్యులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అల్లినగరంలో బీజామృత విత్తన శుద్ధి కార్యక్రమం



మండవల్లి, జూన్ 29: (ప్రభాతవార్త) మండలంలోని అల్లినగరం గ్రామంలో సోమవారం రైతు నారగాని నాగేశ్వరరావు వరి విత్తనాలకు ప్రకృతి వ్యవసాయ ట్రైనింగు అసోసియేటు (ఎన్ఎఫ్ఏ) డి.మధుబాబు సూచనలు మేరకు సామూహిక బీజామృత విత్తన శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మరు మాస్టరు ట్రైనరు ఎం.నాగవిజయ రైతులకు బీజామృతంతో విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం ద్వారా విత్తనం మరియు భూమి ద్వారా సంక్రమించే బ్యాక్టీరియా, శిలీంద్రాలు, ఇతర తెగుళ్ల ప్రభావం తగ్గి, విత్తనాలు మొలక శాతం పెరగడంతో పాటు వేర్ల అభివృద్ధి మెరుగై మొక్కలు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. రసాయన విత్తన శుద్ధి మందులకు ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో రైతులు స్వయంగా తయారు చేసుకునే ఈ ప్రకృతి వ్యవసాయ ఇన్పుట్ను ప్రతి రైతు పంట ప్రారంభానికి ముందు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, కౌలు రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా పేకాట.. కానరాని పోలీసులు

### -పేకాట వెంకన్నకు అండగా పోలీసు నాగు-గుట్టుగా సాగుతున్న పేకాట

ముదినేపల్లి . జూన్ 29( ప్రభాతవార్త) పేకాట, కోడిపందెంలపై ఉక్కు పాదం మోపుతామంటూ ఊదరగొట్టే పోలీసులు.. ఎప్పుడు చూసిన రోడ్ల పక్కన, కాలవగట్టు, చెరువుగట్టుపై పేకాటాడుతున్న వారిని ఇద్దరిని, ముగ్గురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.500లు లేదా రూ.1000లు స్వాధీనపరుచుకుని గొప్పగా పత్రికలకు ప్రెస్ నోట్లు పంపిస్తున్నారు. అయితే అసలుభారీగా శిబిరాలు నిర్వహించి రూ. లక్షలాది సంపాదించుకునే బడాబాబులను మాత్రంపట్టుకున్న దాఖలాలు లేవు. పైగా వారి ఆట మూడు పువ్వులు.. ఆరుకాయలుగా సాగేలా పోలీసుల్లోనే కొంత, మంది పూర్తిగా సహకరిస్తున్నారనే విమర్శలు అధికంగా వినిపిస్తున్నాయి. అయినా ఖాకీలు మాత్రం అవి ఏమీ పట్టించుకోకుండా జూదాలు ఎక్కడ జరుగుతున్నాయంటూ అమాయకంగా ప్రశ్నిస్తున్నారు.ప్రతిపక్షం విమర్శించినా..సింగరాయపాలెం సెంటరులో అద్దాల మేడల్లో భారీగా పేకాట ఆడుతున్నారని, అయినా పోలీసులు పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పదేపదే విమర్శిస్తున్నారు. దీనివల్ల దొంగతనాలు, అపహరణలు వంటివి బాగా జరుగుతున్నాయని, ఎస్పీ స్పందించి జూదాలపై ఉక్కుపాదం మోపాలని అనేక సార్లు కోరినా అసలు ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో భారీ ఎత్తున పేకాట శిబిరాలు జరిగేవి. వాటిపై దాడులు చేసి అనేక కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం అవి అలానే జరుగుతున్నాయి, కాని పోలీసులకు మాత్రం కనిపించడం లేదు.పేకాట వెంకన్నకు అండగా పోలీసు నాగుసింగరాయపాలెం సెంటరు జూదాల కేంద్రంగా మారింది. జిల్లాల సరిహద్దులు ఇక్కడ ఉండటంతో దానిని అదునుగాతీసుకుని కోడిపందెంలు, పేకాట నిర్వహిస్తున్నారు.సింగరాయపాలెం సెంటరులో రోజు పందెంరాయుళ్లు వేచి ఒక ప్రదేశం నిర్ణయించుకోగా అక్కడ నుంచి ఆ ప్రదేశానికి వెళ్లిపోతారు. వీరికి సోడా బండులు, పాన్ షాపు వారు సైతం నిఘాగా వ్యవహరిస్తున్నారు. ఇక వెంకన్న తీరే వీరు. ఆయనే ప్రత్యేకంగా కారు ఏర్పాటు సచేసి మరీ పేకాట శిబిరం వద్దకుతీసుకువెళ్లతాడ్నుషాపు వారు సైతం నిఘాగా వ్యవహరిస్తున్నారు. ఇక వెంకన్న తీరే వీరు. ఆయనే ప్రత్యేకంగా కారు ఏర్పాటు చేసి మరీ పేకాట శిబిరం వద్దకు తీసుకువెళ్లతాడు. సకల మర్యాదలు చేస్తాడు.. చేవూరు, కాకరవాడ, చెన్నూర్రు, శ్రీహరిపురం పరిధిలో పేకాట జోరుగా నిర్వహిస్తున్నారు. ఇతనికి పోలీసుల్లోని నాగు పూర్తి సహకారంఅందిస్తు న్నట్లు సమాచారం. వెంకన్న కారునే పోలీసులు సొంత వినియోగించుకోవడంతో పాటు ముడుపులు తీసుకుని సహకారం అందిస్తున్నట్లు సమాచారం. అందుకనే ఇప్పటి వరకు నాగు శిబిరంపై పోలీసులు దాడులు జరగలేదు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోను కోడిపందెంలు, పేకాట జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందిస్తారా లేక ఇలానే పేకాట, కోడిపందెంలు నిర్వహణకు సహకరిస్తారో వేచి చూడాలి.

## జంగారెడ్డిగూడెంలో ముమ్మరంగా ఓటర్ల డిజిటలైజేషన్ సర్వే



జంగారెడ్డిగూడెం జూన్ 29 ప్రభాత వార్త రాష్ట్ర ఎన్నికల కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఎస్ఐఆర్ సర్వే ముమ్మరంగా సాగుతోంది. 2002 ఓటర్ లిస్టుకు ప్రస్తుత ఓటర్లను మ్యాప్ చేస్తూ పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు 98.20 శాతం ఏన్యుమరేషన్ ఫామ్స్ పంపిణీ పూర్తి కాగా, 22.42 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన ఏన్యుమరేషన్ ఫామ్స్ ను త్వరితగతిన పంపిణీ చేస్తూ, వంద శాతం డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్ మరియు వివిధ పార్టీల రాజకీయ నాయకులు పాల్గొని సర్వే తీరును పరిశీలించారు. నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

## వారంలోగా నీటి సమస్య పరిష్కరించాలని జె సి ఆదేశం



భీమవరం టౌన్, జూన్ 29 : ప్రభాతవార్త పసికర్లు ఎక్కిన నీటిని త్రాగునీటి చెరువులకు, తద్వారా ప్రజలకు త్రాగేందుకు పంపిణీ చేస్తున్నారని అఖిలభారత అగ్రగామి కిసాన్ సభ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డికి వినతి పత్రం సమర్పించింది. వారం లోగా సమస్య పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించినట్లు కిసాన్ సభ రాష్ట్ర ఉపాధ్య క్షులు దండు శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవ రంనుండి,గొల్లవానితిప్ప,మీదుగాకొత్తపూసలమర్రు, దొంగపిండి వెళ్లే పంటకాలువ చెత్త,ప్లాస్టిక్ వ్యర్థాలతోనిండి, కలుషితం అయ్యి, మంచినీరు రంగుమారి పసర్లుఎక్కి ఉన్నాయని ఆ నీటిని కాలువద్వారా మంచి నీటి చెరువులకు పెడుతున్నట్లు, ప్రజలు రోగాల బారినపడి ఇబ్బంది పడుతున్నారని గతంలోనే రెండు సార్లు పిజిఆర్ఎస్ లో కలెక్టర్ కు పిర్యాదు చేసినా పట్టించుకోలే దన్నారు. అఖిల భారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్రఉపాధ్యాక్షులు దండు శ్రీనివాస రాజు,రాష్ట్ర కార్యదర్శి తిరుమాని వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యధర్శి కనుమూరి వెంకట పతి రాజు, రైతు సంఘం నాయకులు బాషా, దుగ్గిరాల శ్రీను తదితరుల ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి మెమోరాండం ఇచ్చినట్లు చెప్పారు. కలుషితం అయిన నీళ్ళ బాటిళ్ళు జెసి కి చూపించి వివరించడం జరిగిందని తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికా రులకీ,ఎంపీడీఓ, భీమవరం ప్రాంత అన్ని గ్రామాల సెక్రటరీలకు, భీమవరం మునిసిపల్ అధికారులకు, కాలువల్లో , డ్రైనేజీల్లో చెత్త ,మురుగునీరు కలవకుండా వారం రోజులలోపు పరిష్కారం చూపాలని అదేశించారన్నారు. అల్ ఇండియా అగ్రగామి కిసాన్ సభ తరుపున జాయింట్ కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

## కొమ్మర హైస్కూల్లో కెరియర్ గైడెన్స్ కార్యక్రమం



అత్తిలి, జూన్ 29 (ప్రభాత వార్త )అత్తిలి మానవతా యూనిట్ ఆధ్వర్యంలో కొమ్మర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు., వెలగల నారాయణ రెడ్డి ఆర్థిక సహకారంతో విద్యార్థులకు ఫైల్స్, కాంపస్ బాక్సులు బహూకరించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కెరియర్ గైడెన్స్ కమిటీ చైర్ పర్సన్ కోడూరి రాధా పుష్పవతి విద్యార్థులకు నైతిక విలువలు బోధన, పదవ తరగతి తర్వాత ఏ కోర్సులు ఎంపిక చేసుకోవాలి అనే విషయాలను తెలియజేశారు. జిల్లా పరిషత్ హై స్కూల్ హెడ్మాస్టర్ ఆర్ రవి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అత్తిలి యూనిట్ చైర్మన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కెరీర్ గైడెన్స్ కమిటీ డైరెక్టర్ ఆనాల ఆదినారాయణ రావు, అత్తిలి యూనిట్ అధ్యక్షులు కోరిపల్లి విజయ్ కుమార్, కోశాధికారి కుక్కల వెంకట రామారావు, పూర్వపు అధ్యక్షులు' బోడపాటి సూర్యచంద్రరావు అధ్యాపకులు, విద్యార్థులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## డిఇఓ కార్యాలయ ముట్టడి

భీమవరం టౌన్, జూన్ 29 : ప్రభాతవార్త పి జి ఆర్ ఎస్ నిర్వహణ సందర్భంగా సోమవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్లో ఎబివిపి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. డిఇఓ నారాయణ ఎబివిపి విద్యార్ధి సంఘ నాయకుల వద్దకు వచ్చి వినతి పత్రం స్వీకరించారు. ఎబివిపి విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో మౌలిక పరిస్థితులు కల్పించకుండానే అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, గుర్తింపు లేని విద్యాసంస్థలను రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని బుక్స్ , బ్యాగ్ లు ఇప్పటివరకు ఇవ్వకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కల్పించే బస్సు సౌకర్యాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా కల్పించాలని, వర్షాకాలం వస్తే కొన్ని పాఠశాలల్లో వర్షపు నీరు చేరి అనేక ఇబ్బందులు పడుతున్నారని అలాంటి పాఠశాలలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## పేరుపాలెం బీచ్లో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

మొగల్తూరు, జూన్ 29 (ప్రభాతవార్త): పేరుపాలెం బీచ్లో ఆదివారం సరదాగా గడపడానికి వెళ్లి సముద్రంలో గల్లంతైన విద్యార్థి సీహెచ్. సుభాష్ (17) సోమవారం ఉదయం మృతదేహంగా లభ్యమయ్యాడు. మోళ్లపర్రు తీర ప్రాంత సమీపంలో సుభాష్ మృతదేహం కొట్టుకువచ్చినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.కాగా, ఆదివారం స్నేహితులతో కలిసి పేరుపాలెం బీచ్కు వెళ్లిన సుభాష్ సముద్రంలో స్నానం చేస్తుండగా అలల ఉధృతికి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి పోలీసులు, మత్స్యకారులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా, సోమవారం ఉదయం మోళ్లపర్రు తీరంలో అతని మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రజా సమస్యల వేదికలో ఐదు అర్జీల స్వీకరణ



మొగల్తూరు, జూన్ 29 (ప్రభాతవార్త):మొగల్తూరు మండల ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించిన సమావేశంలో మొత్తం ఐదు అర్జీలు స్వీకరించినట్లు మండల తహసీల్దార్ అహ్మద్ ఫరూక్ తెలిపారు.అందిన అర్జీల్లో మూడు తమ భూములకు సర్వే నిర్వహించాలని కోరగా, ఒకటి పేరుపాలెం సౌత్ గ్రామంలో మంచినీటి కొళాయి ఏర్పాటు చేయాలని, మరో అర్జీలో మొగల్తూరు గ్రామం గుంటపల్లిపాలెంలోని డ్వాక్రా గ్రూపు సభ్యులు రుణం చెల్లించని సభ్యుడి నుంచి బకాయిలు వసూలు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు ఆయన వివరించారు. అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి, నిబంధనల మేరకు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, డిప్యూటీ ఎంపీడీవో మేడిన్ నవీన్ కిరణ్, డీఎల్డీఓ ఎన్వీఎస్ సూర్యనారాయణ, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్వీఎస్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ జేఈ అరటికట్ల వెంకటేశ్వరరావు, వెలుగు సీసీ సత్యనారాయణ, అంగన్వాడీ సూపర్వైజర్ విజయ్కుమారి, కాళీపట్నం ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపై చెట్ల కొమ్మల తొలగింపు



మొగల్తూరు, జూన్ 29 (ప్రభాతవార్త): పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగల్తూరులోని రామాలయం నుంచి పాతకాలువ వరకు ప్రధాన రహదారి వెంబడి ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులను సోమవారం విద్యుత్ శాఖ అధికారులు చేపట్టారు.విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా, ప్రమాదాలు నివారించేందుకు శాఖ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది విద్యుత్ లైన్లకు అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను జాగ్రత్తగా తొలగించారు.వర్షాకాలంలో ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. దీంతో విద్యుత్ అంతరాయాలు తగ్గడంతో పాటు ప్రమాదాలను కూడా నివారించవచ్చని పేర్కొన్నారు.ఈ చర్యను స్థానికులు స్వాగతిస్తూ, ప్రధాన రహదారిపై ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఇలాంటి నిర్వహణ పనులను తరచూ చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు.

## ఆందోళన వద్దు..అందుబాటులోనే అమ్మవారి ఆలయం నిర్మిస్తాం,ఎమ్మెల్యే చిర్రి



జీలుగుమిల్లి, జూన్-29, (ప్రభాతవార్త)భక్తులు ఆందోళన చెందవద్దని, ఇప్పుడున్న శ్రీ జగదాంబ అమ్మవారి ఆలయ సమీపంలోనే మరో శ్రీ జగదాంబ నూతన ఆలయాన్ని అన్ని హంగులతో నిర్మిస్తామని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు అన్నారు. సోమవారం మండలంలోని బర్రింకలపాడు వద్ద జరిగిన ఏరువాక పౌర్ణిమలో ఎమ్మెల్యే బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు హిందూ సంఘాల నేతలు ఎమ్మెల్యేను కలిశారు. శ్రీ జగదాంబ అమ్మవారి ఆలయం జాతీయ రహదారి విస్తరణలో తొలగించాల్సి ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇందుకు బాలరాజు స్పందిస్తూ జాతీయ రహదారి విస్తరణ పనులు ముగియగానే ఇప్పుడున్న ఆలయ సమీపంలోని భక్తుల మనోభావాలకు అనుగుణంగా నిర్మిస్తామన్నారు. సమస్యను విన్నవించిన వారిలో చాట్రాతి ప్రసాద్, చిర్రి వెంకటేశ్వరరావు, కోలా ధర్మరాజు, బొలగాని వెంకటేశ్వరరావు, చక్రి కక్కిరాల, యాండ్ర చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## కూటమి ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడు అండగా ఉంటుంది : డా. కామినేని శ్రీవాస్



ముదినేపల్లి జూన్ 29(ప్రభాత వార్త ).ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్ కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ ఏరువాక పౌర్ణమి సందర్భంగా ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామములో ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామినేని ముందుగా రైతులందరికి ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నాయకులతో కలిసి నాగలితో పొలం దున్నీ రైతులను ఉత్తేజ పరిచారు. తాము కూడా రైతు కుటుంభమే అని తెలియజేసారు. అనంతరం సమావేశంలో పాల్గొని కూటమి పార్టీ ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని అన్నదాత సుఖీభవ పథకంతో రైతులను ఆదుకుంటున్నామని అన్నారు. ప్రతి రైతు సంతోషంగా ఉండాలనే ధృడ సంకల్పంతో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు,కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి



పెనుమంట్ర, జూన్-29, (ప్రభాతవార్త) మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఏరువాక పౌర్ణమి ఘనంగా నిర్వహించినట్లు సంస్థ ఏడిఆర్ డా.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పండుగ రైతుల ప్రధాన వ్యవసాయ పండుగలలో ఒకటి. ఇది ప్రతి సంవత్సరం జ్యేష్ఠ పౌర్ణమి రోజున, సాధారణంగా జూన్ నెలలో జరుపుకుంటారు. వర్షాకాలం ప్రారంభమై, ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధమయ్యే సమయంలో ఈ పండుగ వస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. "ఏరు" అంటే నాగలి లేదా దున్నే వ్యవసాయ పరికరం, "వాక" అంటే ప్రారంభం. కాబట్టి "ఏరువాక" అంటే వ్యవసాయ పనుల ప్రారంభం అని అర్థం అని సహ పరిశోధనా సంచాలకులు డా.సి.హెచ్.శ్రీనివాస్ తెలియజేశారు. పండుగ సాంప్రదాయం లో భాగంగా రైతులు తమ ఎద్దులు, నాగలి, వ్యవసాయ పరికరాలను శుభ్రపరచి అలంకరిస్తారు. ఎద్దులకు పసుపు, కుంకుమ పెట్టి, పూలదండలు వేసి ప్రత్యేక పూజలు చేస్తారు. భూమాతకు, వర్షదేవునికి ప్రార్థనలు చేసి మంచి వర్షాలు, సమృద్ధిగా పంటలు పండాలని కోరుకుంటారు. పూజల అనంతరం రైతులు పొలంలో మొదటి దుక్కి (మొదటి దున్నకం) ప్రారంభించడం ఆనవాయితీ అని ఆయన తెలిపారు. ఏరువాక పౌర్ణమి రైతులకు కొత్త వ్యవసాయ సంవత్సరానికి నాంది కనుక ఈ సంవత్సరం వానలు బాగా కురిసి పంటలు బాగా పండాలని రైతులకు మంచి లాభాలు రావాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమం లో శాస్త్రవేత్తలు, భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా వ్యవసాయ పనిముట్లకు పూజలు చేసిన వ్యవసాయ క్షేత్రంలో దుక్కిలు చేయడం ప్రారంభించారు.

## వైభవంగా సాయి సప్త హాలు



ఆగిరిపల్లి జూన్ 29 ప్రభాతవార్త సింగన్నగూడెం బస్ స్టాప్ వద్ద గల శ్రీ సర్వ గారి సిద్ధి షిరిడి సాయిబాబా ఆలయంలో ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి నామ స్మరణతో సాయి సప్తహాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన సేవకులు దేవులపల్లి నరసింహమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## బిలాల్ మసీద్ నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

### వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ ఎండి కరీముల్లాకు వినతి



జంగారెడ్డిగూడెం జూన్ 29 ప్రభాత వార్త జంగారెడ్డిగూడెం స్థానిక ప్రసిద్ధ బిలాల్ మసీద్లో నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని మసీద్ జమాత్ సభ్యులు జంగారెడ్డిగూడెం వచ్చిన వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ ఎండి కరీముల్లాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జమాత్ సభ్యులు మాట్లాడుతూ, మసీద్కు నెలకు రూ. 1.25 లక్షలు, ఏడాదికి రూ. 15 లక్షల ఆదాయం వస్తున్నా ప్రెసిడెంట్లు లెక్కలు చూపకుండా విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల సహకారంతో తప్పుడు ఆడిట్ నివేదికలు ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని, ప్రస్తుతం అకౌంట్లో నిల్వలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇకపై రాజకీయ నేపథ్యం ఉన్నవారికి కాకుండా, ఐదు పూటలా నమాజ్ చేసే భక్తులలో ఒకరిని ప్రెసిడెంట్గా ఎన్నుకుంటామని జమాత్ సభ్యులు స్పష్టం చేశారు. అలాగే నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు జాయింట్ అకౌంట్ విధానాన్ని తెస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, వక్ఫ్ బోర్డు చైర్మన్కు కూడా ఫిర్యాదు చేస్తున్నామని, తక్షణమే పూర్తిస్థాయి విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఇన్స్పెక్టర్ ఎండి కరీముల్లాను డిమాండ్ చేశారు.

## వేగవరంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు



జంగారెడ్డిగూడెం జూన్ 29 ప్రభాత వార్త ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామంలో టొబాకో బోర్డు ఉపాధ్యక్షులు అట్లూరి సతీష్ వ్యవసాయ క్షేత్రంలో ఏరువాక పౌర్ణమి (రైతు పూజోత్సవం) వేడుకలు ఘనంగా జరిగాయి. జంగారెడ్డిగూడెం వేలం నిర్వహణ కేంద్రం నెంబర్ 32 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అట్లూరి సతీష్, ఆక్షన్ సూపరింటెండెంట్ ఎం గ్రేస్ మార్గరేట్, స్థానిక ప్రజాప్రతినిధులు అనిశెట్టి వెంకన్న బాబు, కుక్కల సత్తిబాబు, ప్రగడ ప్రభుదాస్, ఘంటసాల ప్రభాకర్ రావు మరియు రైతులు పాల్గొని ట్రాక్టర్ తో దుక్కి దున్ని, నవధాన్యాలు చల్లి సాగు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆక్షన్ సూపరింటెండెంట్ మార్గరేట్ తో పాటు, విచ్చేసిన బోర్డు సిబ్బందిని, రైతులను అట్లూరి సతీష్ శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## కాళ్ళకూరు వెంకన్నకు రూ.101116 విరాళం



కాళ్ల, జూన్ 29( ప్రభాతవార్త)శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి మాడవీధులు విస్తరణకు దాతలు సహకారం అభినందనీయమని దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు అద్దాల వెంకట శివరామరాజు అన్నారు. మండలంలోని కాళ్ళకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి కాళ్ళకూరుకు చెందిన కీ.శే. ముదుండి కమలమ్మ జ్ఞాపకార్థము భర్త ముదుండి వెంకట సత్యనారాయణ రాజు కుమారుడు ముదుండి వెంకట విజయ రామరాజు-సునీత దంపతులు రూ. 1,01,116/- విరాళం ఆలయ కార్యనిర్వహణాధికారి మొక్క మోకా అరుణ్ కుమార్, ఆలయ ధర్మకర్తల మండల అధ్యక్షులు అద్దాల శివరామరాజులకు అందజేశారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో విరాళం అందించిన దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి మోకా అరుణ్ కుమార్, పాలక మండలి అధ్యక్షులు అద్దాల శివరామరాజు, పాలక మండలి సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించారు.

## మేకలదిబ్బ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



కాళ్ళ జూన్ 29 (ప్రభాతవార్త) విద్యార్థులంతా విద్యార్థులంతా ఉన్నదులుగా ఉన్నత విద్యార్థులుగా అభివృద్ధి చెందాలని నాయకుడు యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిహెచ్ పట్టాభి రామయ్య విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటా వెంకట్రాం అన్నారు. మండలంలోని మేకల దెబ్బ గ్రామానికి చెందిన పట్టాభిరామయ్య వారి కుటుంబ సభ్యులు సంవత్సరం విద్యార్థులకు ఈ ఏడాది విద్యార్థులందరికీ అవసరమైన నోట్బుక్స్, పెన్లు, పెన్సిళ్లు, కలర్ పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.పట్టాభి రామయ్య, సి.హెచ్.యశ్వంత్, సి.హెచ్.భరత్ మాతాజీ పాఠశాల ఉపాధ్యాయులు కోట వెంకట రామ్, ఉమామహేశ్వరి విద్యార్థులు పాల్గొన్నారు.

## జూలై 04న శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి మోహన్ రంగా విగ్రహ విష్కరణలు



పెనుమంట్ర, జూన్-29, (ప్రభాతవార్త) మండలంలోని మార్టేరు కూడలిలో ఈనెల నాలుగో తేదీన శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు మార్టేరు పంచ గ్రామ కాపు సంఘం, ఆచంట నియోజకవర్గ కాపు జేఏసీ సోమవారం తెలిపింది. వంగవీటి రంగా విగ్రహాన్ని ఆయన కుమారుడు మాజీ శాసనసభ్యులు వంగవీటి రాధా, కృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ ఆవిష్కరించనున్నారు. ఈ ఆవిష్కరణలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని నేతలు తెలిపారు.

## పీహెచ్సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జేడీ నిర్మల గ్లోరీ



మొగల్తూరు, జూన్ 29 (ప్రభాతవార్త): పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులోని శ్రీ పెనుమత్స రంగరాజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం విజయవాడ ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ నిర్మల గ్లోరీ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్య కేంద్రం పరిధిలో 37 పల్స్ పోలియో కేంద్రాల ద్వారా మొత్తం 5,189 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి 100 శాతం లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసిన వైద్యాధికారులు డాక్టర్ కందులపాటి లక్ష్మీపార్వతి, డాక్టర్ హెన్నా, వైద్య సిబ్బందిని అభినందించారు.ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ముత్యాలపల్లి గ్రామంలోని శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని పలు ప్రశ్నలు అడిగి కార్యక్రమం అమలుపై ఆరా తీశారు.అలాగే ముత్యాలపల్లి గ్రామంలో ఏఎన్ఎం తులసమ్మ పర్యవేక్షణలో నిర్వహించిన ఇంటింటా పల్స్ పోలియో సర్వేను స్వయంగా పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులను అడిగి సర్వే నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఏఎన్ఎం (సీహెచ్) తులసమ్మ పనితీరును ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ తనిఖీ సందర్భంగా మొగల్తూరు శ్రీ పెనుమత్స రంగరాజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యం : రామరాజు



మొగల్తూరు, జూన్ 29 (ప్రభాతవార్త): పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గెదర్లా వంపు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి, ఆట వస్తువులను నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పొత్తూరి రామరాజు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పొత్తూరి రామరాజు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. చిన్నారులు విద్యలో ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించడంతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు బలోపేతానికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందిస్తూ, విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమ రంగాల్లో ట్రస్ట్ అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు పొత్తూరి రామరాజు, ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

జంగారెడ్డిగూడెం బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఖాతాదారుల ఆందోళన

## న్యాయం చేయాలని ఏఎస్పీ సుస్మిత ఆర్కి వినతి



జంగారెడ్డిగూడెం జూన్ 29 ప్రభాత వార్త ?జంగారెడ్డిగూడెం బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో బంగారం మాయమైన ఘటనపై బాధితుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. పోయిన తమ బంగారాన్ని వెంటనే తిరిగి ఇచ్చి, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఖాతాదారులు బ్యాంకు వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. బ్యాంకు యాజమాన్యానికి వ్యతిరేకంగా కొద్దిసేపు నినాదాలు చేశారు. అనంతరం బాధితులంతా కలిసి ఏఎస్పీ సుస్మిత రామనాథన్ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. తాము దాచుకున్న బంగారానికి రక్షణ లేకుండా పోయిందని, బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి తమకు పూర్తి న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ?బాధితుల వినతిపై ఏఎస్పీ సానుకూలంగా స్పందించారు. ఈ బంగారం మాయమైన ఘటనపై దర్యాప్తు అత్యంత వేగంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. బాధితులెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, విచారణ పూర్తి చేసి ఖాతాదారులందరికీ ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.